సాక్షి శ్రీకాకుళం

శుక్రవారం । 27 । డిసెంబర్ । 2024



దోమల దండయాత్ర

ఊళ్లపై దోమలు దండయాత్ర చేస్తున్నాయి. పాలకులు పట్టించుకోవడం లేదు.

- 10లో



గంజాయి ముఠా గుట్టురట్టు

గంజాయి ముఠా గుట్టు రట్టయ్యింది. 12 మందిని అరెస్టు చేశారు.

- 10లో

11న జానపద గేయాల పోటీలు

పలాస: మండలంలో రంగోయి గ్రామంలో సంక్రాంతి సందర్భంగా జనవరి 11న గిడుగు రామ్మూర్తి తెలుగు భాషా, జానపద కళా పీఠం ఆధ్వర్యంలో జిల్లా స్థాయి జానపద గేయాల పోటీలు నిర్వహిస్తున్నట్టు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు బద్రి కూర్మారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల గాయకులు 9704798643 నంబరును సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

న్యూస్‌రీల్

దివ్యాంగులకు పెట్రోల్ సబ్సిడీ

శ్రీకాకుళం పాతబస్టాండ్: దివ్యాంగులకు పెట్రోల్ సబ్సిడీ కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు విభిన్న ప్రతిభావంతుల సహాయ సంచాలకులు కె.కవిత అన్నారు. సొంత వ్యాపారం చేస్తున్నా లేదా గుర్తింపు కలిగిన ప్రైవేటు సంస్థల్లో పనిచేస్తున్న మూడు చక్రాల మోటరైజ్డ్ వాహనం కలిగి ఉన్న దివ్యాంగులు సబ్సిడీ కోసం దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. నిర్ణీత ఫారం పూర్తి చేయాలని, ఆ ఫారంతో పాటు సదరం సర్టిఫికెట్, పెట్రోల్ కొనుగోలు చేసిన బిల్లులు, తెల్ల రేషన్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, వాహనం రిజిస్ట్రేషన్ పత్రం, బ్యాంకు పాసు బుక్ మొదటి పేజీ, ఆధార్ కార్డు, ప్రైవేటు సంస్థలో పనిచేస్తున్న ధ్రువీకరణ పత్రం, ఒక పాస్ పోర్టు సైజ్ ఫొటోను సహాయ సంచాలకులు, విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమశాఖ, శ్రీకాకుళం వారి కార్యాలయానికి దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు 08942- 240519 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలి



సబ్‌జైల్ రికార్డులను పరిశీలిస్తున్న జైళ్ల శాఖ డీఐజీ రవి కిరణ్

పాతపట్నం: పాతపట్నం సబ్‌జైల్‌లో ఉంటున్న ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలని కోస్టల్ ఆంధ్ర రేంజ్(రాజమండ్రి) డీఐజీ ఎం.రవి కిరణ్ అన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా స్థానిక సబ్ జైల్‌ను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఖైదీలతో మాట్లాడి వారికి అందిస్తున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. జైలు రికార్డులు పరిశీలించారు. వంటగదులు, స్టార్ రూమ్‌లను తనిఖీ చేశారు. ఖైదీల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఆయనతో పాటు జిల్లా సబ్‌జైళ్ల అధికారి కె.మోహనరావు, సూపరింటెండెంట్ జి.రాము, జైల్ సిబ్బంది పాల్గొన్నారు.

బ్లాక్‌స్పాట్ జోన్స్ గుర్తించాలి : ఎస్పీ

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాలో రహదారి ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, ప్రమాదాలు ఎక్కువ జరిగే బ్లాక్‌స్పాట్ జోన్స్ గుర్తించాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి అధికారులకు స్పష్టం చేశారు. గురువారం రాత్రి శ్రీకాకుళం, కాశీబుగ్గ సబ్ డివిజన్ పరిధి పోలీసు అధికారులతో వీడియోకాన్ఫరెన్స్ ద్వారా ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలు, ప్రమాద ప్రదేశాలు, కేసుల నమోదు, దర్యాప్తునకు సంబంధించి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ వాహనచోదకులకు, ప్రజలకు బ్లాక్ స్పాట్‌లపై అవగాహన కల్పించాలని, రహదారి భద్రతా నియమాలు పాటించని వారిపై జరిమానాలు విధించాలన్నారు. వేకువజామున ప్రధాన చెక్ పోస్టుల వద్ద డ్రైవర్‌లకు ఫేస్‌వాష్ చేయించాలని, ట్రాఫిక్ ఎన్‌ఫోర్సుమెంట్ వర్క్స్ ముఖ్య కూడళ్ల వద్ద పెంచాలని, ప్రమాద హెచ్చరిక బోర్డులు, రోడ్లపై రేడియం స్టిక్కర్లు, పెయింటింగ్ సోలార్ బ్లింకర్స్ వంటివి ఏర్పాటు చేయాలని అన్నారు.


పసికందు మృతిపై ఆర్డీఓ విచారణ



జరిగిన సంఘటనపై వైద్యుల వివరణ తెలుసుకుంటున్న ఆర్డీఓ

టెక్కలి రూరల్: నందిగాం మండలం కైజోల గ్రామానికి చెందిన పి.శ్రావణి అనే గర్భిణికి స్థానిక ఆస్పత్రిలో ప్రసవం జరిగింది. కానీ పుట్టిన వెంటనే బిడ్డ చనిపోయాడు. వైద్యుల నిర్లక్ష్యమే దానికి కారణమని బాధిత కుటుంబ సభ్యులు ఆరోపించారు. దీనిపై పలు పత్రికల్లో వచ్చిన కథనాల ఆధారంగా గురువారం టెక్కలి ఆర్డీఓ ఎం.కృష్ణమూర్తి జిల్లా ఆస్పత్రికి వచ్చి విచారణ నిర్వహించారు. ప్రసూతి వైద్యురాలు ధనలక్ష్మి, స్రవంతితో పాటు ఆ సమయంలో ఉన్న సిబ్బందిని ప్రశ్నించారు. డెలివరీ సమయంలో ఏం జరిగిందో ఆరా తీశారు. ఈ ఘటనపై దర్యాప్తు జరిపేందుకు రిమ్స్ సూపరింటెండెంట్‌తో మాట్లాడి ముగ్గురు సభ్యులతో కూడిన కమిటీ ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ కమిటీలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓతో పాటుగా సీనియర్ గైనకాలజిస్ట్, సీనియర్ పిడియాట్రిస్ట్‌లు ఉంటారని తెలిపారు. కమిటీ నివేదిక వచ్చిన తరువాత బాధిత కుటుంబ సభ్యులను సైతం పిలిపించి వారితో కూడా మాట్లాడి తుది నివేదికను కలెక్టర్‌కు అందజేసి తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆయనతో పాటుగా టెక్కలి తహసీల్దార్ దిలీప్ చక్రవర్తి, వైద్యులు లక్ష్మణరావు, పాల్గొన్నారు.

బాబు మార్క్ కరెంట్ షాక్ | షాకుల సర్దుపోట్లు



- వరుసగా విద్యుత్ చార్జీల పెంపు
- నిన్న సర్దుబాటు.. నేడు అదనపు సర్దుబాటు పేరుతో వడ్డన
- ఈ నెల బిల్లు నుంచే యూనిట్ విద్యుత్‌పై గరిష్టంగా రూ.3 అదనం
- జిల్లాలో 7.88 లక్షల మంది వినియోగదారులపై భారం
- బాబు బాదుడుపై నేడు వైఎస్సార్‌సీపీ పోరుబాట
- చార్జీలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ జిల్లా వ్యాప్తంగా నిరసనలు

"భవిష్యత్‌లో విద్యుత్ చార్జీల పెంపు ఉండబోదు. కుదిరితే వెంటనే చార్జీలు తగ్గిస్తాం. నాణ్యమైన విద్యుత్ రావాలంటే, విద్యుత్ చార్జీలు పెరగకుండా ఉండాలంటే కూటమి ప్రభుత్వం రావాలి. వైసీపీ పోవాలి. విద్యుత్ బిల్లుల భారం తగ్గిస్తామని మేనిఫెస్టోలో కూడా పెట్టాం.' -ఎన్నికల ప్రచారంలో భాగంగా జిల్లాలోనే కాదు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన సభల్లో చంద్రబాబు చేసిన వ్యాఖ్యలివి.



ప్రజల పక్షాన వైఎస్సార్‌సీపీ పోరుబాట నేడు



విద్యుత్ చార్జీల అదనపు భారాన్ని మోపిన కూటమి ప్రభుత్వ వైఖరికి నిరసనగా వైఎస్సార్‌సీపీ పోరుబాటకు సిద్ధమైంది. మొన్నటికి మొన్న రైతుల పక్షాన పోరాటం చేయగా, నేడు విద్యుత్ వినియోగదారుల తరపున ఆందోళన చేయనుంది. ప్రజలతో కలిసి నాయకులు, కార్యకర్తలు ర్యాలీలు నిర్వహించి, ప్లకార్డులతో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేసి, విద్యుత్ కార్యాలయాల వద్ద నిరసన తెలియజేయనున్నారు. పెంచిన చార్జీలను తగ్గించాలని కోరుతూ నినదించనున్నారు. శుక్రవారం నియోజకవర్గాల వారీగా నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నారు. వైఎస్సార్ కూడళ్లు, ప్రధాన జంక్షన్ల నుంచి నిరసన ర్యాలీలు ప్రారంభించి, విద్యుత్ కార్యాలయాల వద్ద ధర్నా చేసి, చార్జీలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ అధికారులకు వినతి పత్రాలు అందజేయనున్నారు. నియోజక వర్గాల సమన్వయకర్తల ఆధ్వర్యంలో జరిగే నిరసన కార్యక్రమాలకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు సమరోత్సాహంతో పాల్గొనున్నాయి.

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

బాబు మార్క్ మళ్లీ సుస్పష్టమైంది. మొన్నటికి మొన్న సర్దుబాటు పేరుతో ఓ సారి విద్యుత్ చార్జీలు పెంచారు. ఇప్పుడు అదనపు సర్దుబాటు పేరుతో మళ్లీ పెంచేందుకు సిద్ధమయ్యారు. ఐదేళ్ల పాటు విద్యుత్ చార్జీలు పెంచబోమని చెప్పి గద్దెనెక్కిన చంద్రబాబు అధికారంలోకి వచ్చిన ఆరు నెలలకే విద్యుత్ చార్జీలను రెండుసార్లు పెంచారు. నమ్మి ఓట్లేసినందుకు కరెంటు షాకిచ్చారు. ఇప్పటికే ఐదున్నర కోట్లకు పైగా అదనపు భారం పడింది. జనవరి, ఫిబ్రవరిలో ఇంకెంత భారం ఉంటుందో తెలియని పరిస్థితి నెలకొంది.


పెంపు ఇలా..



చంద్రబాబు అధికారంలోకి వచ్చేసరికి ఎల్‌టీ (డొమెస్టిక్) వినియోగదారుడు నెలకు 30 యూనిట్ల లోపు వరకు వినియోగిస్తే యూనిట్‌కు దాదాపు రూ.1.90 వసూలు చేశారు. కానీ, చంద్రబాబు వచ్చాక సర్దుబాటు పేరుతో ఇదే యూనిట్ చార్జీ రూ.3.20 వరకు పెంచగా, అదనపు సర్దుబాటు పేరుతో ఇదే యూనిట్ ధర దాదాపు రూ.4.70 వరకు పెరిగేలా నిర్ణయం తీసుకున్నారు. అదే 400 యూనిట్ల వరకు వినియోగదారుడికైతే చంద్రబాబు పెంచకముందు యూనిట్ ధర సుమారు రూ.9.75 కాగా తొలిసారి పెంపుతో రూ.12.30 వరకు పెరిగింది. ఇప్పుడు మళ్లీ యూనిట్ ధర దాదాపు రూ.15 వరకు పెరిగేలా వడ్డించారు.

చలికాలంలో తగ్గాలి కదా..

సాధారణంగా సెప్టెంబర్, అక్టోబర్ వరకు విద్యుత్ వినియోగం ఎక్కువగా ఉంటుంది. చలి ఎక్కువగా ఉండే నవంబర్, డిసెంబర్‌లో తక్కువ వినియోగం ఉంటుంది. ఎందుకంటే, ఏసీలు ఇతరత్రా వినియోగం తగ్గుతాయి. కానీ, చంద్రబాబు మాయతో నవంబర్, డిసెంబర్‌లో విద్యుత్ వినియోగం తగ్గినా కూడా బిల్లు పెరిగిన పరిస్థితి చోటు చేసుకుంది. చంద్రబాబు పెంచకముందు విద్యుత్ వినియోగం దృష్ట్యా అన్ని రకాల చార్జీలతో కలిపి నెలకు సరాసరి రూ.97.16 కోట్లు (గత ప్రభుత్వ హయాంలో డిమాండ్) వరకు డిమాండ్ ఉండేది. డిసెంబర్‌లో వచ్చే బిల్లులో అమాంతంగా రూ.102.62కోట్లకు డిమాండ్ చేరింది. ఇక జనవరిలో వచ్చే బిల్లులో రెండో సారి పెంచిన చార్జీలు జత కానున్నాయి. అప్పుడు ఇంకెంతకు డిమాండ్ చేరుతుందో అంచనా వేయలేని పరిస్థితి నెలకుంది.



మొదటి షాక్

15 నెలల పాటు అంటే ఈ ఏడాది నవంబర్ నుంచి 2026 జనవరి వరకు అమలు కానున్న ఈ అదనపు భారంతో ప్రజల నెత్తిన విద్యుత్ షాక్ ఇచ్చేలా సర్కార్ చర్యలకు దిగింది. ఈ క్రమంలో గరిష్ఠంగా యూనిట్‌కు సుమారు రూ.1.55 వరకు విద్యుత్ చార్జీలు పెరిగాయి.

రెండో షాక్

ఇంధన కొనుగోలు ఖర్చు సర్దుబాటు చార్జీలు (ఎఫ్‌పీపీసీఏ) పేరిట డిసెంబర్ నుంచి వరుసగా 15 నెలల పాటు భారం తప్పదని మళ్లీ భారం వేశారు. దీని ప్రకారంగా అదనంగా యూనిట్‌కు సుమారు మరో రూ.1.52 వరకు పెరిగే అవకాశముంది.

– పై రెండు షాక్‌ల ఫలితంగా ఒక్కో యూనిట్‌పై వినియోగదారునిపై గరిష్ఠంగా రూ.3 వరకు భారం మోపింది.

సర్దుబాటు పేరుతో బుకాయింపు



తన ఆరు నెలల పాలనలో రెండుసార్లు విద్యుత్ చార్జీలు పెంచిన బాబు.. గత పాలకుల వల్లనే ఇలా పెంచాల్సి వచ్చిందని బుకాయిస్తున్నారు. జిల్లాలో శ్రీకాకుళం, పలాస, టెక్కలి డివిజన్ల పరిధిలో మొత్తం 7,88,078 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వీటిలో హెచ్‌టీ వినియోగదారులు కేవలం 477 మాత్రమే ఉండగా మిగిలినవారంతా ఎల్‌టీ వినియోగదారులే. చంద్రబాబు వీరికిచ్చిన షాక్‌లు ఇలా ఉన్నాయి.

వరుస షాక్‌లు..

ఒక వైపు విద్యుత్ చార్జీల పెంపు.. మరోవైపు నిత్యావసరాల వస్తువుల ధరల పెంపుతో సామాన్యులకు వరుస షాక్‌లు తగులుతున్నాయి. చాలీచాలని వేతనాలు, జీతాలతో నెట్టుకొస్తున్న వారికి చార్జీల పెంపు శిరోభారంగా మారింది. సామాన్యులకైతే కష్టతరంగా మారుతోంది. ఇస్తామన్న సంక్షేమ పథకాలను అమలు చేయకుండా చార్జీలను పెంచుకుపోతుండటంతో భరించలేకపోతున్నారు.

రైతుల సమస్యల పరిష్కారానికి చర్యలు



మాట్లాడుతున్న జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: రైతుల సమస్యలకు ప్రాధాన్యత ఇవ్వాలని, ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉంచిన ధాన్యం తడిసి పోకుండా చూడాలని, అలాగే అవసరమైన రైతులకు టార్పాలిన్లు, టెంట్‌లు, గోనె సంచులు, ఇతర వసతులను అందుబాటులో ఉంచాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ ఆదేశించారు. అధికారులతో కలసి ప్రతివారం నిర్వహిస్తున్న సమీక్షలో భాగంగా గురువారం సాయంత్రం ఆయా మండలాల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి ఆయన మాట్లాడారు. అన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాలు తెరుచుకోవాలని, వచ్చిన ధాన్యం వచ్చినట్టు సేకరించాలని ఆదేశించారు. గత కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు జరిగిన పంట నష్టాన్ని కచ్చితత్వంతో నమోదు చేయాలని, వీటిని సంబంధిత ఆర్డీఓలు పర్యవేక్షించాలని ఆదేశించారు. పల్లె పండుగలో శంకుస్థాపనలు చేసిన అన్ని పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. పల్లె పండుగలో 3497 పనులు మంజూరు కాగా 91 శాతం పనులు గ్రౌండ్ అయినట్లు ఆయా అధికారులు తెలపగా పనులన్నీ వంద శాతం గ్రౌండ్ అయ్యేటట్లు చూడాలని ఎంపీడీఓలను ఆదేశించారు. బాలల ఆధార్ నమోదు ప్రక్రియ వేగవంతం చేయాలని చెప్పారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు, ఉప కలెక్టర్లు పద్మావతి, జిల్లా పంచాయతీ అధికారి కె.భారతి సౌజన్య, ఐసిడిఎస్ పీడీ బి.శాంతి శ్రీ, జిల్లా పరిషత్ ముఖ్య కార్య నిర్వహణాధికారి ఎల్.ఎన్.వి. శ్రీధర్ రాజా, ఏపీ ఈపీడీసీఎల్ ఎస్ఈ కృష్ణమూర్తి పాల్గొన్నారు.

కటిక నేలపైనే..



టెక్కలి రూరల్: స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో ఓ రోగి కటిక నేలపై పడుకుని తీవ్ర ఇబ్బందులకు గురయ్యాడు. టెక్కలికి చెందిన ఎస్.గణేష్ అనే డయాలసిస్ రోగి వైద్యం కోసం టెక్కలి జిల్లా ఆస్పత్రికి వచ్చాడు. డయాలసిస్ చేసేందుకు కొంత సమయం ఉండటంతో ఆ వ్యక్తి నిలబడేందుకు సైతం తీవ్ర ఇబ్బందులకు గురి కావడంతో అక్కడే ఉన్న బెంచీపై పడుకునే ప్రయత్నం చేశారు. అయితే అక్కడ పడుకోవడానికి వీల్లేదని చెప్పడంతో వేరే దారి లేక నేలపై అట్టలు వేసుకుని పడుకున్నాడు.

పారదర్శకంగా కానిస్టేబుల్ దేహదారుఢ్య పరీక్షలు

- అభ్యర్థులు దళారులను నమ్మవద్దు
- 30 నుంచి ఎచ్చెర్ల మైదానంలో పీఎంటీ, పీఈటీ టెస్టులు
- ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి



శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా పరిధిలో స్టైపెండరీ సివిల్ పోలీస్ కానిస్టేబుల్ (పురుషులు, మహిళలు), ఏపీఎస్పీ కానిస్టేబుళ్ల (పురుషులు) ఉద్యోగాలకు సంబంధించి దేహదారుఢ్య పరీక్షలు పారదర్శకంగా జరగనున్నాయని, దళారుల మాట నమ్మి అభ్యర్థులు మోసపోవద్దని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు నిర్వహించిన ప్రిలిమినరీ పరీక్షలో ఎంపికైన అభ్యర్థులకు ఫిజికల్ మెజర్‌మెంట్ టెస్ట్ (పీఎంటీ), ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్ (పీఈటీ)లు ఎచ్చెర్లలో ఉన్న జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీసు కార్యాలయం పరేడ్ మైదానంలో ఈ నెల 30 నుంచి జనవరి 18 వరకు జరగనున్నాయని ఎస్పీ తెలిపారు. ఈ మేరకు గురువారం ఉదయం జిల్లా పోలీసు కార్యాలయంలో రిక్రూట్‌మెంట్‌కు సంబంధించి విధి విధానాలు, పాటించాల్సిన నియమాలు, జాగ్రత్తలు, బందోబస్తు వంటి అంశాలపై అధికారులు, సిబ్బందితో ఎస్పీ గురువారం సమీక్షించారు.

పోటీలో 7390 మంది అభ్యర్థులు..

జిల్లాలో 7390 మంది అభ్యర్థులు తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. వీరిలో 6215 మంది పురుషులు, 1175 మంది మహిళలు పాల్గొంటారని, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించడమే కాక సీసీ కెమెరాలు, వైద్యసదుపాయాల కల్పనలో భాగంగా అంబులెన్సులు సైతం ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్పీ వెల్లడించారు.

అభ్యర్థులు పాటించాల్సినవి..

- అభ్యర్థులు కాల్‌లెటర్‌లో తెలిపిన తేదీ, నిర్ణీత సమయానికి హాజరుకావాలి. లేదంటే అనుమతించరు.
- అభ్యర్థులు తమతో పాటు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లు, గెజిటెడ్ అధికారితో అటెస్ట్ చేయించిన జిరాక్స్ పత్రాలు ఒక సెట్టు తీసుకురావాలి. ఒరిజినల్ సర్టిఫికెట్లతో రాకుంటే అభ్యర్థిత్వం తిరస్కరిస్తారు.
- కాల్ లెటర్‌లో తెలిపిన స్కోర్ కార్డు (ఒరిజినల్ రిజల్ట్), స్టేజ్-1 అప్లికేషన్, స్టేజ్-2 అప్లికేషన్లు తప్పనిసరిగా తీసుకురావాలి.
- పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు వెరిఫికేషన్ సమయంలో వాటి వివరాలను అధికారులకు తెలియపరచాలి.

దళారులను నమ్మవద్దు

ఏపీఎస్‌పీఆర్‌బీ వారితో నిర్వహించనున్న ఈ దేహదారుఢ్య పరీక్షలు నోటిఫికేషన్ అనుసరించి నిష్పక్షపాతంగా, పారదర్శకంగా జరుగుతాయని, ఉద్యోగాలు ఇప్పిస్తామని మాయమాటలు చెప్పి డబ్బులడిగే వారిని ఎట్టి పరిస్థితుల్లో నమ్మవద్దని ఎస్పీ హెచ్చరించారు. అలాంటివారు తారసపడితే తక్షణమే సమాచారాన్ని 6309990800, 6309990911 ఫోన్ నంబర్లకు డయల్ చేసి చెప్పాలన్నారు. ఫోన్ చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. సమావేశంలో అదనపు ఎస్పీ కె.వి.రమణ, డీఎస్పీలు ఎం.అప్పారావు, డీఎస్‌ఆర్‌వీఎస్‌ఎన్ మూర్తి, ఏవో సిహెచ్ గోపినాధ్, సీఐ ఎం.అవతారం, ఆర్ఐ నర్సింగరావు సిబ్బంది పాల్గొన్నారు.

ఆదాయం పెంచుకునేందుకు భూమంత్రం



- 30 నుంచి 40 శాతం పెరగనున్న భూముల ధరలు
- వైఎస్సార్‌సీపీ హయాంలో కేవలం 10శాతమే పెంపు
- ప్రజల నెత్తిన భారం వేస్తున్న ప్రభుత్వం
- ధరలు పెరిగితే రియల్ ఎస్టేట్ వ్యాపారం కుదేలు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): ప్రజల నెత్తిన మరో దారిలో భారం వేసేందుకు కూటమి ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. భూముల ధరలు ఎప్పుడూ పది శాతానికి మించి పెంచేవారు కాదు. గత వైఎస్సార్‌సీపీ హయాంలోనూ పది శాతమే పెంచారు. కానీ కూటమి ప్రభుత్వం మాత్రం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి భూములు ధరలు పెంచి తద్వారా ప్రభుత్వ ఆదాయాన్ని పెంచాలనే ఆలోచనలోనే ఉంది. ఏకంగా 30 నుంచి 40శాతం వరకు భూముల ధరలు పెంచేసి ప్రజలపై భారాన్ని వేయాలని చూస్తోంది. ఇప్పటికే రియల్ ఎస్టేట్ వ్యాపారం అంతంత మాత్రంగా ఉంది. నూతన సంవత్సరం జనవరి 1వ తేదీ నుంచి కొత్త ధరలు అమల్లోకి వస్తే ప్రస్తుతం వ్యాపారం కూడా అవ్వదని రియల్ వ్యాపారులు చెబుతున్నారు. దీంతో భూముల క్రయవిక్రయాలు భారీగా తగ్గిపోనున్నాయి.

భూముల ధరలు ఇలా..

ఉదాహరణకు గజం ధర 2019లో రూ.100 ఉంటే కూటమి ప్రభుత్వం పెంచబోయే ధరతో రూ.140కు చేరుతుంది. ఎకరం రూ.10లక్షలు ఉంటే ఇప్పుడు పెరిగిన ధరతో రూ.14లక్షలు అవుతుంది. ఒక్కసారి ధరలు పెరగంతో భవిష్యత్‌లో రిజిస్ట్రేషన్లు కష్టమేనని రియల్ వర్గాలు చెబుతున్నాయి.



గజం ధరలు ఇలా..

సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం	2019కి ముందు 2019లో	పెరగబోయే ధర
శ్రీకాకుళం	రూ. 36800-38600	రూ. 54,040
ఆమదాలవలస	రూ. 10800-12000	రూ. 16,800
నరసన్నపేట	రూ. 8400-9200	రూ. 12,880
టెక్కలి	రూ. 3000-3300	రూ. 4,620
కాశీబుగ్గ	రూ. 16000-17600	రూ. 24,640
హిరమండలం	రూ. 2000-2200	రూ. 3080
పాతపట్నం	రూ. 900-1100	రూ. 1540
కోటబొమ్మాళి	రూ. 3500-3800	రూ. 5320
ఇచ్ఛాపురం	రూ. 2700-3000	రూ. 4200
మందస	రూ. 1600-1720	రూ. 2408
సోంపేట	రూ. 3500-3850	రూ. 5390
పొందూరు	రూ. 1400-1500	రూ. 2100
రణస్థలం	రూ. 3150-3740	రూ. 5236

ప్రభుత్వ నిబంధనల మేరకే పెంపు

ప్రభుత్వ నిబంధనల మేరకే పెంపు ఉంటుంది. పెరిగిన ధరలకు అనుగుణంగా రిజిస్ట్రేషన్ చార్జీలుంటాయి. స్టాంప్ డ్యూటీ 6.5 శాతం, రిజిస్ట్రేషన్ ఫీజు 1శాతం ఉంటుంది. భూములు కొనుగోలు, అమ్మకందారులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. జనవరి 1 నుంచి పెరిగిన ధరలు అమల్లోకి వచ్చే అవకాశం ఉంది. ఎంత శాతం పెంచాలన్నది ప్రభుత్వం పూర్తిగా నిర్ణయం తీసుకోలేదు. 30 నుంచి 40శాతం పెరిగే అవకాశం ఉంది.

– ఎ.నాగలక్ష్మి, ఇన్‌చార్జ్ జిల్లా రిజిస్ట్రార్, శ్రీకాకుళం

40 శాతం పెరిగితే ధరలు ఇలా..

- శ్రీకాకుళం జిల్లా కేంద్రం రూరల్ ప్రాంతంలో ఎకరం రూ. 11.55లక్షలు ఉంటే పెరిగిన ధరతో రూ. 16.17లక్షలు అవుతుంది.
- నరసన్నపేట ప్రాంతంలో గతంలో ఎకరం రూ.7 లక్షలు ఉండేది. ఇప్పుడు రూ. 9.80లక్షలు అవుతుంది.
- రణస్థలం ప్రాంతంలో ఎకరం రూ. 5లక్షలు ఉండేది. పెరిగిన ధరలతో రూ. 7లక్షలకు చేరుకుంటుంది.
- కాశీబుగ్గ ప్రాంతంలో రూ.4.9లక్షలు నుంచి రూ. 6.86లక్షలకి పెరగనుంది.
- కోటబొమ్మాళి ప్రాంతంలో ఎకరం రూ. 8.80లక్షల నుంచి రూ. 12.32లక్షల వరకు పెరుగుతుంది.
- రివిజన్ కమిటీ సిఫార్సులను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంటే ధరలు కొంచమైనా తగ్గే అవకాశం ఉంటుంది. ఈ కమిటీలో చైర్మన్‌గా జాయింట్ కలెక్టర్, మెంబర్లుగా జిల్లా పరిషత్ సీఈవో, సుడా వైస్‌చైర్మన్, కన్వీనర్‌లుగా సబ్‌రిజిస్ట్రార్లు ఉంటారు.

మంచుకాలంలో మధుర ఫలం



వానాకాలంలోనేమో ఎండలు కాచాయి..

శీతాకాలంలో తుఫాన్లు భయపెడుతున్నాయి. ఏంటో వాతావరణం విచిత్రంగా మారిపోతోంది. ఎండాకాలంలో దొరకాల్సిన తాటిముంజలు సిక్కోలు దారుల్లో ఇప్పుడు కనిపిస్తున్నాయి. వేసవిలో నోరూరించిన బంగినపల్లి మామిడి పండ్లు ఈ కాలంలోనూ అందుబాటులోకి వచ్చేశాయి. శ్రీకాకుళంలో బంగినపల్లి మామిడి పండ్లు కిలో రూ.200లకు విక్రయిస్తున్నారు. తాటి ముంజలు ప్రస్తుతం డజను రూ.70కు అమ్ముతున్నారు.

– శ్రీకాకుళం



క్లుప్తంగా

సీవీఓతో ఎస్ఈ భేటీ



సీవీఓను కలిసిన కృష్ణమూర్తి

అరసవల్లి: విద్యుత్ శాఖ చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ కె.వి.రామకృష్ణప్రసాద్‌ను సర్కిల్ ఎస్ఈ నాగిరెడ్డి కృష్ణమూర్తి మర్యాదపూర్వంగా భేటీ అయ్యారు. స్థానిక విద్యుత్ కార్యాలయానికి గురువారం వచ్చిన సీవీఓతో శాఖ ప్రగతిపై సమీక్షించారు. లైన్‌లాస్ తగ్గించేందుకు, విద్యుత్ చౌర్యం నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు. అనంతరం స్థానిక విజిలెన్స్ విభాగాన్ని సీవీఓ తనిఖీ చేశారు.

శ్రీముఖలింగంలో తిరువీధి ఉత్సవం



తిరువీధి నిర్వహిస్తున్న దృశ్యం

జలుమూరు : ప్రసిద్ధి శైవక్షేత్రం శ్రీముఖలింగంలో మార్గశిర బహుళ ఏకాదశి సందర్భంగా గురువారం స్వామివారికి తిరువీధి ఉత్సవం ఘనంగా నిర్వహించారు. పార్వతీ పరమేశ్వరులను అలంకరించి పల్లకిలో ఉంచి మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపు చేపట్టారు. భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

వ్యక్తి అదృశ్యం



కిల్లాన చైతన్య

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాకేంద్రంలోని గుజరాతీపేట మురపాలవీధికి చెందిన ఓ వ్యక్తి అదృశ్యమైనట్లు రెండో పట్టణ సీఐ పి.ఈశ్వరరావు గురువారం తెలిపారు. మురపాల వీధికి చెందిన కిల్లాన చైతన్య నగరంలోని ఓ మోటార్ సెంటర్‌లో మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. రూ.లక్షల్లో అప్పులుండటం, మద్యానికి బానిస కావడంతో ఈ నెల 21న రాత్రి ఇంటినుంచి బయటకు వెళ్లిపోయాడు. ఇప్పటి వరకు తిరిగి రాలేదు. ఈ మేరకు చైతన్య భార్య కృష్ణవేణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

ధర్మానను కలిసిన డాక్టర్స్ సెల్ అధ్యక్షుడు వరుణ్



వరుణ్‌తో ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): వైఎస్సార్‌సీపీ డాక్టర్స్ సెల్ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన డాక్టర్ చింతాడవరుణ్ గురువారం మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వరుణ్‌ని దుశ్శాలువతో సత్కరించి అభినందనలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ధర్మాన సూచించారు.


జీడికి గిట్టుబాటు ధర కల్పించాలి



మాట్లాడుతున్న సొంటి నాగరాజు

శ్రీకాకుళం అర్బన్: జిల్లాలో జీడి సమస్యను పట్టించుకునే వారే కరువయ్యారని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో ముఖ్య పాత్ర పోషిస్తున్న జిల్లా మంత్రులు జీడి పిక్కలకు గిట్టుబాటు ధర వచ్చేలా కృషి చేయకపోవడం తగదని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఓబీసీ సెల్ అధ్యక్షుడు సొంటి నాగరాజు అన్నారు. జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన గురువారం శ్రీకాకుళంలోని ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. రాజకీయ పార్టీలు బీసీలకి తగిన గుర్తింపు ఇవ్వడం లేదన్నారు. సాగు, తాగునీటి సమస్యలపై పాలకులు దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు అంబటి కృష్ణారావు, జిల్లా ఇన్‌చార్జి గాదం వెంకట త్రినాథరావు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు మాసుపత్రి చక్రవర్తిరెడ్డి, మామిడి సత్యనారాయణ, మజ్జి మురళీమోహన్, ఆబోతుల వెంకట నాయుడు, బొచ్చ వెంకటరమణ పాల్గొన్నారు.

కొబ్బరి మొక్కలపై విష ప్రయోగం



ఎండిన కొబ్బరి ఆకులను చూపిస్తున్న లక్ష్మీనారాయణ

వజ్రపుకొత్తూరు రూరల్: మండలంలోని బాతుపురం పంచాయతీ వైఎస్సార్ సీపీ సర్పంచ్ బత్తిన సృజన లక్ష్మీనారాయణకు చెందిన కొబ్బరి తోటలోని మొక్కలపై గుర్తు తెలియని వ్యక్తులు విష ప్రయోగం చేశారు. ఇప్పటికే రెండు సార్లు విష ప్రయోగం చేశారని, మరోసారి విష ప్రయోగం చేయడంతో మొక్కలు నాశనమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. తిత్లీ తుఫాన్‌కు కొబ్బరి చెట్లు నేలకొరగడంతో రెండేళ్ల క్రితం లక్షలు రూపాయల వ్యయంతో కడియం నుంచి కొబ్బరి మొక్కలు తెచ్చి నాటానని, వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా ఉన్నానన్న కక్షతో గుర్తు తెలియని వ్యక్తులు ప్రతికార చర్యలకు పాల్పడుతున్నారని చెప్పారు.

దోమల దండయాత్ర!





గాజులకొల్లివలస ఆర్‌అండ్‌ఆర్ కాలనీ సచివాలయంలో మూలకు చేరిన ఫాగింగ్ యంత్రం

- మూలకు చేరిన దోమల నివారణ యంత్రాలు
- పల్లెల్లో విజృంభిస్తున్న దోమలు
- పట్టించుకోని కూటమి పాలకులు

ఆమదాలవలస : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పల్లె, పట్టణం అన్న తేడా లేకుండా పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా చేయిస్తామంటూ హడావుడి చేసిన నాయకులు ఇప్పుడు ఆ సంగతే మర్చిపోయారు. గతంలో పంచాయతీల్లో నిల్వ ఉన్న నిధులు తమ కార్యకర్తలకు కట్టబెట్టేందుకు తూతూమంత్రంగా పనులు చేయించి చేతులు దులుపుకున్నారు. అది కొన్ని గ్రామాల్లోనే ఆ పనులు జరిగాయి. దీంతో గ్రామాల్లో పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. ఎక్కడ చూసినా మురుగు నిల్వలే దర్శనమిస్తున్నాయి. దీంతో ఆయా ప్రాంతాలు దోమలకు ఆవాసంగా మారుతున్నాయి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో దోమల నివారణకు ప్రతి సచివాలయానికి ఒక ఫాగింగ్ యంత్రాన్ని అందించి సరిపడా లిక్విడ్ అందజేసి దోమల నివారణకు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో జిల్లాలో 732 సచివాలయాలకు ఒక్కో ఫాగింగ్ యంత్రాన్ని రూ.65 వేలు చొప్పున కొనుగోలు చేసి అందజేశారు. ఎన్నికల ముందు వరకు గ్రామ స్థాయిలో ఉండే సిబ్బంది, పారిశుద్ధ్య సిబ్బంది ఫాగింగ్ యంత్రాలు ఉపయోగించి గ్రామల్లో దోమల నివారణకు చర్యలు చేపట్టేవారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రజారోగ్యాన్ని గాలికొదిలేశారు. ఫాగింగ్ యంత్రాలు వినియోగించకుండా



ఆమదాలవలస మున్సిపాలిటీ పార్వతీశ్వరునిపేట వద్ద నివాసగృహాల ఎదుట మురుగు

ముసురుతో క్షీణించిన పారిశుద్ధ్యం

ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలతో పట్టణ, గ్రామాల్లో పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నిలిచిపోవడంతో దోమలకు నిలయాలుగా మారాయి. దీంతో టైఫాయిడ్, మలేరియా వంటి విష జ్వరాలు ప్రబలుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి పారిశుద్ధ్య పనులు నిర్వహించి ఫాగింగ్ యంత్రాలు వినియోగంలోకి తీసుకువచ్చి దోమల నివారణకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

సచివాలయాల్లోనే మూలన పడేశారు. దీంతో దోమలు స్వైర విహారం చేస్తున్నాయి.

పంచాయతీలకు నిధులు...

పంచాయితీ అభివృద్ధికి 15వ ఆర్థిక సంఘం నిధులు పెద్ద పంచాయతీకి రూ.5 లక్షలు, చిన్న పంచాయతీలకు రూ.2 లక్షలు చొప్పున నిధులు మంజూరు చేశారు. ఈ నిధులను పారిశుద్ధ్యంతో పాటు తాగునీరు, ఇతర వసతులకు ఖర్చులు చేయాల్సి ఉంది. కాలానుగుణంగా నెలకు మూడు సార్లు ఫాగింగ్ చేయాలి. ఫాగింగ్ యంత్రాలకు పెట్రోల్, డీజిల్ వేయడంతోపాటు మలాథీయన్, వేస్ట్ ఆయిల్‌తో కలిపి పిచికారి చేయాలి. ఒక్కసారి ఫాగింగ్ చేయాలంటే సుమారు రూ.3 వేలు వరకు ఖర్చు అవుతుంది.

చర్యలు చేపట్టాలి..



గతంలో దోమల నివారణకు కాలువలు, వీధుల్లో ఫాగింగ్ యంత్రంతో మందు జల్లేవారు. ఇప్పుడా పరిస్థితి లేదు. దీంతో దోమలు ఎక్కువయ్యాయి. అధికారులు స్పందించి దోమల నివారణకు చర్యలు చేపట్టాలి.

–జి.కృష్ణమూర్తి, పొన్నాంపేట, రామచంద్రపురం పంచాయతీ, ఆమదాలవలస మండలం

యంత్రం పనిచేయడం లేదు..



ఇక్కడికి పంచాయతీ కార్యదర్శిగా వచ్చి రెండు నెలలు అవుతోంది. దోమల నివారణకు ఫాగింగ్ చేసేందుకు లిక్విడ్‌లు లేవు. చాలాకాలం నుంచి యంత్రం వినియోగించకపోవడంతో అది పనిచేయడం లేదు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాను.

– ఎస్.సంతోష్, పంచాయితీ కార్యదర్శి, ఆర్‌అండ్‌ఆర్ కాలనీ, గాజులకొల్లివలస

చర్యలు తీసుకుంటాం

సచివాలయాల్లో ఫాగింగ్ యంత్రాలను ఉపయోగించాలని పారిశుద్ధ్య కార్మికులు, సిబ్బందికి సూచనలు అందించాం. పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. దోమల నివారణకు చర్యలు తీసుకుంటాం.

–భారతీ సౌజన్య, జిల్లా పంచాయతీ అధికారి, శ్రీకాకుళం

మొత్తం మండలాలు	గ్రామ పంచాయతీలు	సచివాలయాలు
30	912	732

బ్యాంకర్ల భాగస్వామ్యంతోనే ఆర్థిక ప్రగతి



సమావేశంలో పాల్గొన్న బ్యాంకర్లు, వెండర్లు

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా ఆర్థిక ప్రగతిలో బ్యాంకర్ల భాగస్వామ్యం, సహకారం ఎంతో అవసరమని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. కలెక్టర్ చాంబర్‌లో గురువారం జిల్లా స్థాయి సమీక్ష మండలి డీసీసీ (డీఎల్ఆర్‌సీ) సమావేశం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో కలిసి స్వయం ఉపాధి పథకాల అమలు, రుణాల మంజూరు, గత త్రైమాసికంలో సాధించిన ప్రగతిపై బ్యాంకులు, ప్రభుత్వ శాఖల వారీగా సమీక్షించారు. అనంతరం ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వార్షిక రుణ ప్రణాళికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 2024–25 ఆర్థిక సంవత్సరానికి రెండో త్రైమాసికం ఆగస్టు 30 నాటికి క్రెడిట్ ప్లాన్ లక్ష్యం రూ.12586.45 కోట్లకు గాను రూ.9681.68 కోట్ల రుణాలు మంజూరు చేసి 76.92 శాతం ఆర్థిక ప్రగతిని సాధించామని వివరించారు. వ్యవసాయ రంగంలో మొదటి ఆర్థిక సంవత్సరం రెండవ త్రైమాసికం నాటికి వ్యవసాయ రుణాలకు సంబంధించి రూ.7744 కోట్ల లక్ష్యానికి గాను రూ.5878 కోట్ల రుణాలు అందజేసి 75.9 శాతం ఆర్థిక ప్రగతిని సాధించామని లీడ్ బ్యాంకు మేనేజర్ ఎం.సూర్యకిరణ్ తెలిపారు. పి.ఎం విశ్వకర్మ, పి.ఎం సూర్యఘర్, లక్‌పతి దిది ఎడ్యుకేషన్ రుణాల మంజూరు తదితర అంశాలకు సంబంధించి ఆయా శాఖల అధికారులు చేపడుతున్న పనులు వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రుణాలు మంజూరులో జాప్యం లేకుండా బ్యాంకులు ప్రణాళికలు రూపొందించాలన్నారు. ప్రజల జీవనోపాధి మెరుగుపడేలా పథకాలు అమలు చేయాలని సూచించారు. పారిశ్రామికరంగం అభివృద్ధి చెందినప్పుడే జిల్లా జీడీపీ వృద్ధి చెందుతుందని, ఇందుకు బ్యాంకర్లు సంపూర్ణ సహకారాన్ని అందించాలని కోరారు.

- జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ మాట్లాడుతూ కౌలు రైతులు నష్టపోకుండా గుర్తింపు కార్డులను పంపిణీ చేయాలన్నారు. అర్హులందరికీ కిసాన్ క్రెడిట్ కార్డులను జారీ చేయాలని ఆదేశించారు. పీఎం సూర్యఘర్ రుణాల మంజూరులో జాప్యం జరగకూడదన్నారు. వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధక, మత్స్యశాఖ, జిల్లా గ్రామీణ అభివృద్ధి, మెప్మా, నాబార్డ్, డ్వామా, చేనేత జౌలు శాఖలు చేపట్టిన పనులపైనా కలెక్టర్ ఆరా తీశారు. లీడ్ బ్యాంకు మేనేజర్ ఎం.సూర్యకిరణ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రీజనల్ మేనేజర్ ఎం.వి.తిలక్, ఆర్‌బీఐ ఏపీ రీజియన్ ఎల్‌డీఓ గిరిధర్ బెహరా, డీసీసీబీ సీఈఓ డి.వరప్రసాద్, నాబార్డు డీడీఎం కె.రమేష్‌కృష్ణ, ఉద్యాన, వ్యవసాయ, పశు సంవర్ధక, మత్స్యశాఖ, డీసీసీబీ సీఈవో వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కారు ఢీకొని ఇద్దరికి గాయాలు

టెక్కలి రూరల్: మండలంలోని శ్యామసుందరాపురం సమీపంలో జగతిమెట్ట సర్వీస్ రోడ్డుపై గురువారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..నౌపడ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్, టెక్కలి తెలుగుదేశం పార్టీ నాయకుడు మల్ల బాలకృష్ణ తన డ్రైవర్ ఎం.రామకృష్ణతో కలిసి శ్రీకాకుళం వైపు కారులో బయలుదేరారు. జగతిమెట్ట వద్దకు వచ్చేసరికి డ్రైవర్‌కు మూర్ఛ వ్యాధి రావడంతో ఒక్కసారిగా కారు అదుపు తప్పి ముందుగా సైకిల్‌పై వెళ్తున్న ఎన్టీఆర్ కాలనీకి చెందిన తాపీమేస్త్రి హనుమంతు సింహాచలంను ఢీకొట్టారు. అనంతరం సర్వీస్ రోడ్డుపై ఉన్న కాలువపైకి కారు దూసుకెళ్లడంతో ఎదురుగా బైక్‌పై వస్తున్న అక్కవరం గ్రామానికి చెందిన కుమ్మరి గోపాల్‌ను కూడా ఢీకొట్టారు. ఈ ఘటనలో తాపిమేస్త్రికి తీవ్ర గాయాలు కాగా, గోపాల్‌కు స్వల్ప గాయాలయ్యాయి. మూర్ఛవ్యాధికి గురైన డ్రైవర్‌ను కిందకు దించిన అనంతరం హైవే అంబులెన్స్‌లో ముగ్గురిని టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన సింహాచలంను మెరుగైన చికిత్స కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ ఘనపై టెక్కలి పోలీసులు కేసునమోదు చేశారు.



తీవ్రంగా గాయపడిన తాపీమేస్త్రి సింహాచలం

కారు ఢీకొని సాఫ్ట్‌వేర్ ఉద్యోగి దుర్మరణం

ఆమదాలవలస: మండలంలోని కొత్త రోడ్డు సమీపంలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో కూన భరత్‌కుమార్ (38) అనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి చెందినట్లు ఎస్సై కె.వెంకటేష్ తెలిపారు. ఎచ్చెర్ల మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన భరత్‌కుమార్ హైదరాబాద్‌లోని ఇన్ఫోసిస్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్నారు. ఇటీవల జిల్లాకు వచ్చిన ఆయన గార మండలం ఆడవరం గ్రామంలో ఉన్న అత్తవారింటికి బైక్‌పై వెళ్లాడు. బుధవారం తిరిగి స్వగ్రామానికి వస్తుండగా కొత్త రోడ్డు జంక్షన్ వద్ద ఒడిశాకు చెందిన కారు అతివేగంగా వచ్చి ఢీకొనడంతో భరత్‌కుమార్ అక్కడికక్కడే మృతిచెందాడు. భరత్‌కుమార్‌కు భార్య గాయత్రి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

విలీన సభను విజయవంతం చేయండి

పలాస : హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 28న సి.పి.ఐ.ఎం.ఎల్ న్యూడెమొక్రసీకి చెందిన రెండు విప్లవ పార్టీల విలీన సభను విజయవంతం చేయాలని పార్టీ జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాష్ పిలుపునిచ్చారు. ఈ మేరకు పలాస మండలం బొడ్డపాడు అమరవీరుల స్మారక మందిరం వద్ద గురువారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనివార్య కారణాలు వల్ల ఒకే పార్టీ రెండుగా చీలిపోయి కొన్నేళ్లుగా పనిచేస్తున్నాయని, ఆ రెండు విప్లవ పార్టీలు నేడు ఒకటిగా విలీనం కావడం విప్లవ శ్రేణులకు శుభపరిణామన్నారు. సభకు ప్రధాన వక్తగా జాతీయ అధికార ప్రతినిధి దర్శన సింగ్ ఖట్కర్ హాజరవుతారని పేర్కొన్నారు. నక్సల్బరి, గోదావరిలోయ, శ్రీకాకుళం పోరాటాల ప్రేరణతో ఏర్పడిన న్యూడెమొక్రసీకి ఘనమైన విప్లవ చరిత్ర ఉందన్నారు. భవిష్యత్తులో విప్లవ కారులంతా ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో అరుణోదయ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నశెట్టి రాజశేఖర్, ఎ.ఐ.కె.ఎం.ఎస్ జిల్లా నాయకుడు గొరకల బాలకృష్ణ, పి.ఓ.డబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి పోతనపల్లి కుసుమ, పి.వై.ఎల్ జిల్లా కన్వీనరు సార జగన్, బర్ల గోపి, పోతనపల్లి మల్లేశ్వరరావు, రాపాక మాధవరావు, జద్దే అప్పయ్య పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న న్యూడెమొక్రసీ నాయకులు,కార్యకర్తలు

ఏపీజీవీబీ సేవలకు అంతరాయం

గార : మండల పరిధిలోని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు ఖాతాదారులకు ఈ నెల 28 నుంచి జనవరి 1 వరకు సేవల్లో అంతరాయం కలుగుతుందని కళింగపట్నం, శ్రీకూర్మం బ్రాంచి మేనేజర్లు రాజేష్, శర్మ గురువారం తెలిపారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు కలిపి ఉన్న బ్యాంకు విడిపోవడం, పునరుద్ధరణ చర్యలు నేపథ్యంలో బ్యాంకు శాఖలు, సీఎస్‌పీలతో పాటు ఆన్‌లైన్ సేవలు నిలిచిపోనున్నాయని పేర్కొన్నారు. ఖాతాదా రులు గమనించి సహకరించాలని కోరారు.

యువతి ఆత్మహత్య

- గోప్యంగా ఉంచిన పాఠశాల నిర్వాహకులు
- గ్రామపెద్దల జోక్యంతో పోలీసులకు ఫిర్యాదు చేసిన తల్లిదండ్రులు



నీరజ మృతదేహాన్ని రిమ్స్‌కు తరలిస్తున్న దృశ్యం (ఇన్‌సెట్లో) నీరజ (ఫైల్)

ఎచ్చెర్ల క్యాంపస్/గార : ఎచ్చెర్ల మండల కేంద్రంలోని కేశవరెడ్డి పాఠశాల ఆవరణలోని వసతి గృహంలో నర్సరీ అసోసియేట్‌గా పనిచేస్తున్న గనగళ్ల నీరజ(21) అనే యువతి ఆత్మహత్య చేసుకుంది. బుధవారం రాత్రి ఈ ఘటన జరగ్గా గురువారం వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గార మండలం కళింగపట్నం పంచాయతీ నగరాలపేటకు చెందిన నీరజ మూడు నెలలుగా కేశవరెడ్డి స్కూల్లో పనిచేస్తోంది. ఈమె అక్క గనగళ్ల హేమలత ఇదే పాఠశాలలో రిసెప్షనిస్టుగా పనిచేస్తున్నారు. ఇద్దరూ పాఠశాల వసతి గృహంలోని ఒకే గదిలో ఉంటున్నారు. బుధవారం సాయంత్రం ఆరు గంటల సమీపంలో అక్క హేమలత వర్క్ ముగించుకొని గదికి రాగా తలుపు గడియపెట్టి ఉంది. అనుమానం వచ్చి సిబ్బందికి సమాచారం ఇవ్వగా వారు తలుపు తీశారు. అప్పటికే నీరజ సీలింగ్ ఫ్యాన్‌కు చున్నీతో ఉరి వేసుకుంది. ఈ విషయం మేనేజ్‌మెంట్, స్థానిక పాలనా విభాగానికి తెలియజేయగా మృతదేహాన్ని బయటకు తీసి స్వగ్రామం తీసుకువెళ్లాలని సోదరి హేమలతకు సూచించారు. దీంతో అంబులెన్సులో బుధవారం రాత్రి 10 గంటల సమయంలో నగరాలపేటకు మృతదేహాన్ని తరలించారు. అదే రోజు రాత్రి 11 గంటల సమయంలో ఈ ఘటనపై తమ వద్ద ఉన్న సమాచారం మేరకు పాఠశాలకు పోలీసులు వెళ్లగా, ఇక్కడ ఎటువంటి సంఘటన జరగలేదని సిబ్బంది చెప్పడంతో వెనుతిరిగారు. గురువారం ఉదయం సైతం మళ్లీ పాఠశాలకు వెళ్లినా ఎటువంటి సంఘటన జరగలేదని సిబ్బంది చెప్పటంతో వెనుదిరిగారు. గురువారం అంత్యక్రియలు నిర్వహించేందుకు కుటుంబ సభ్యులు సిద్ధం కాగా, గ్రామపెద్దలు వారించారు. ఆత్మహత్య చేసుకున్నందున పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచిండంతో తల్లిదండ్రులు గార పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. ఎచ్చెర్ల పరిధిలో ఘటన జరిగినందున అక్కడికి వెళ్లి ఫిర్యాదు చేయాలని గార పోలీసులు సూచించడంతో తండ్రి రాంబాబు ఎచ్చెర్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు యువతి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహానికి శ్రీకాకుళం రిమ్స్‌లో పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. అనంతరం కేశవరెడ్డి ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, స్థానికంగా ఉన్న వారిని ఎచ్చెర్ల ఎస్సై వి.సందీప్‌కుమార్ విచారించారు. యువతి ఆత్మహత్యకు, పాఠశాల నిర్వాహకులకు ఎటువంటి సంబంధం లేకపోయినా రహస్యంగా ఉంచటం, పోలీసులకు చెప్పకపోవడానికి గల కారణాలపై ఆరా తీశారు. పోస్టుమార్టం నివేదిక ఆధారంగా దర్యాప్తు సాగుతుందని పోలీసులు తెలిపారు. కాగా, పాఠశాల యాజమాన్యం బుధవారం క్రిస్మస్ సెలవుకాగా, గురువారం సైతం ప్రభుత్వం సెలవు ఇచ్చిందని విద్యార్థుల తల్లిదండ్రులకు మెసేజ్ పంపించడం గమనార్హం.

విద్యార్థులకు భారంగా స్పెషల్ డ్రైవ్ పరీక్ష ఫీజులు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వ విద్యాలయంలో ఫిబ్రవరి మొదటి వారంలో డిగ్రీ సెమిస్టర్ స్పెషల్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ మేరకు రిజిస్ట్రేషన్లు ప్రారంభించారు. అయితే అధికారులు నిర్ణయించిన ఫీజులు భారీగా ఉన్నాయని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సెమిస్టర్ పరీక్షకు సాధారణంగా రూ.400 వసూలు చేస్తుంటారు. ప్రస్తుత స్పెషల్ డ్రైవ్ పరీక్ష ఫీజు మాత్రం పేపర్‌కు రూ.3000, రెండు పేపర్లుకు రూ.5000, మూడు పేపర్లుకు రూ.6500, నాలుగు కంటే ఎక్కువ పేపర్లుకు రూ.8000 చెల్లించాల్సి ఉంటుంది. మొత్తం ప్రయోగాలకు రూ.7000, ఒక పేపర్ ప్రాక్టికల్‌కు రూ. 2000, ప్రాజెక్టు వైవా వాయిస్‌కు రూ.2000గా ఫీజులు నిర్ణయించారు. ప్రభుత్వ సంస్థలో వ్యాపార దృక్పథంతో పరీక్ష నిర్వహించటం తగదని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. కాగా, ఈ పరీక్షలకు 2015, 16, 17, 18 అకడమిక్ ఏడాదిల్లో ఫెయిలైన విద్యార్థులకు ఫీజు చెల్లించే అవకాశం కల్పించారు. వీరందరికీ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించకుండా స్పెషల్ డ్రైవ్ పేరిట భారీగా ఫీజులు వసూలు చేయడం తగదని పలువురు విమర్శిస్తున్నారు.

సీఏఎస్ కమిటీ రద్దు కోరుతూ ఫిర్యాదులు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వ విద్యాలయంలో సీఏఎస్ (కెరియర్ అడ్వాన్స్ స్కీం) కమిటీని రద్దు చేయాలని విశ్వవిద్యాలయ పరిరక్షణ కమిటీ పేరిట ఉన్నత విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదులు రావడం చర్చనీయాంశంగా మారింది. వర్సిటీ వర్గాలే పరిరక్షణ కమిటీల పేరిట విద్యాశాఖ మంత్రికి, అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. పాలక మండలి అనుమతి లేకుండా డిసెంబర్ 30న సీఏఎస్ ఇంటర్వ్యూలకు సన్నాహాలు చేస్తున్నారని ఫిర్యాదులో సారాంశం. రిజిస్ట్రార్ సుజాత తనకు సీనియర్ ప్రొఫెసర్ ఉద్యోగోన్నతి కోసం సీఏఎస్ కమిటీ వేశారని, ఇంటర్వ్యూలు సైతం నిర్వహిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నట్లు సమాచారం.

ఆర్టీసీ కార్గో డోర్ డెలివరీ వినియోగించుకోండి

శ్రీకాకుళం అర్బన్: ఆర్టీసీ కార్గో డోర్ డెలివరీ సేవలు వినియోగించుకోవాలని ఆర్టీసీ జిల్లా ప్రజారవాణా అధికారి ఎ.విజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. గురువారం శ్రీకాకుళంలోని ఆర్టీసీ డీపీటీఓ కార్యాలయంలో ఏపీఎస్ ఆర్టీసీలో కార్గో డోర్ డెలివరీ మాసోత్సవాల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ అతి తక్కువ చార్జీలతో అతి వేగంగా డోర్ డెలివరీ ద్వారా పార్సిల్ ఇంటికే చేరవేసేందుకు ఆర్టీసీ చర్యలు చేపట్టిందని అన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ శ్రీకాకుళం ఒకటో డిపో మేనేజర్ హనుమంతు అమరసింహుడు, ఏటీఎం కమర్షియల్ దివ్య, అసిస్టెంట్ మేనేజర్‌లు వి.రమేష్, ఎ.గంగరాజు, ఆఫీసి సిబ్బంది పాల్గొన్నారు.



డోర్ డెలివరీ బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఆర్టీసీ అధికారులు

గంజాయి ముఠా గుట్టురట్టు

- 12 మంది నిందితుల అరెస్టు
- 3.5 కేజీల గంజాయి, 11 మొబైల్ ఫోన్లు, నాలుగు బైకులు స్వాధీనం

రణస్థలం: గంజాయి క్రయవిక్రయాలు సాగిస్తున్న 12 మందిని గురువారం అరెస్టు చేసినట్లు రణస్థలం మండలం జె.ఆర్.పురం సీఐ ఎం.అవతారం, ఎస్సై ఎస్.చిరంజీవి తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి జె.ఆర్.పురం పోలీస్‌స్టేషన్‌లో విలేకరులకు వివరాలు వెల్లడించారు. రణస్థలం మండల కేంద్రం సమీపంలోని దన్నానపేట పెట్రోల్ బంకు వద్దకు రెండున్నర కేజీల గంజాయితో ఆరుగురు వ్యక్తులు వస్తున్నారన్న సమాచారం మేరకు పోలీసులు నిఘా పెట్టారు. వారు రాగానే ఎస్ఐ.చిరంజీవి, సిబ్బంది వెళ్లి పట్టుకున్నారు. గంజాయితో పాటు రెండు బైకులు స్వాధీనం చేసుకున్నాం. పట్టుబడిన ఆరుగురిలో ఒకరు మైనర్. ఈ గంజాయి రవాణాలో జె.ఆర్.పురం పంచాయతీ సీతంవలసకు చెందిన నంబూరి సాయి అనే ట్రాక్టర్ మెకానిక్ కీలకంగా వ్యవహరిస్తున్నాడు. ఒడిశా రాష్ట్రం పర్లాకిమిడికి చెందిన రబింద్రో ప్రధాన్ ద్వారా గంజాయి కొనుగోలు చేసి రణస్థలంలో పొట్లాల రూపంలో అమ్ముతున్నాడు. ఇతనితో పాటు సీతంవలసకే చెందిన పల్లంటి సత్యనారాయణ, లావేరు మండలం బెజ్జిపురం గ్రామానికి చెందిన కోల హర్షవర్ధన్, రణస్థలం మండలం రావాడకు చెందిన తీటి దుర్గాప్రసాద్, మైనర్ కలిసి గంజాయి అమ్ముతున్నారు. వీరి వద్దకు స్థానికులతో పాటు ఇతర జిల్లాలు, మండలాల నుంచి వచ్చి కొనుగోలు చేస్తుండటం గమనార్హం. ప్రధాన నిందితుడు నంబూరి సాయి ఇచ్చిన సమాచారం మేరకు నిఘా వేయగా యాబీ పరిశ్రమ ఎదుట ఉన్న కాలువ వద్దకు గంజాయి కొనేందుకు వచ్చిన మరో ఐదుగురిని కూడా పోలీసులు పట్టుకున్నారు. వీరిలో జె.ఆర్.పురం పంచాయతీ గరికిపాలెం గ్రామానికి చెందిన కొలుచూరు సంతోష్‌కుమార్, పైడి భీమవరం గ్రామానికి చెందిన బుసర పైడిరాజు, విజయనగరం జిల్లా పూసపాటిరేగ మండలం పేరాపురం గ్రామానికి చెందిన ఉప్పాడ విజయ్‌కుమార్, రెల్లివలసకు చెందిన చందక వెంకటేష్, భోగాపురం మండలం సుందరపేటకు చెందిన బంగారు పవన్‌కుమార్ ఉన్నారు. రెల్లివలసకు మహంతి దిలీప్ పరారీలో ఉన్నాడు. మొత్తం 12 మందిని తహసీల్దార్ (మేజిస్ట్రేట్) ఎస్.ప్రసాద్ సమక్షంలో అరెస్టు చూపించామని పోలీసులు తెలిపారు. వీరి వద్ద నుంచి 11 ఫోన్లు, నాలుగు బైకులు, 3.5 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. గంజాయి ముఠాను ఛేదించిన ఎస్సై చిరంజీవిని ఉన్నతాధికారులు ప్రత్యేకంగా అభినందించారు.



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న సీఐ అవతారం, ఎస్సై చిరంజీవి, సిబ్బంది